క్లుప్తంగా

ముగిసిన ఆడికృత్తిక మహోత్సవం



తెనాలిటౌన్: తెనాలి రూరల్‌లోని పెదరావూరు శ్రీ అభయహస్త సుబ్రమణ్యస్వామి ఆలయంలో జరుగుతున్న ఆడి కృత్తిక మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి పల్లకీ సేవ నిర్వహించారు. పుర వీధుల్లో ఊరేగింపు ఉత్సవం జరిగింది. మహా విద్యాపీఠం నిర్వాహకులు సుబ్రమణ్యశర్మ పర్యవేక్షించారు.

తెనాలి ఏడీఏగా ఉషారాణి



తెనాలి: వ్యవసాయ శాఖ, తెనాలి సహాయ సంచాలకులుగా (ఏడీఏ) ఎస్.ఉషారాణి నియమితులయ్యారు. బాపట్ల జిల్లా చీరాల నుంచి ఆమె బదిలీపై తెనాలి వచ్చారు. ఇప్పటివరకు ఈ పోస్టులో కొల్లిపర వ్యవసాయాధికారి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఉషారాణి గతంలో రేపల్లె ఏడీఏగా చేశారు. గుంటూరు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరుగా పనిచేశారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలోకి వీలైనంత ఎక్కువమంది రైతులు వచ్చేలా కృషిచేశారు. ఖరీఫ్ సీజను ఆరంభంలో పూర్తిస్థాయిలో ఏడీఏను నియమించటంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

23న ప్రజా సింహగర్జన



తెనాలి: గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎదురుగా ప్రజా చైతన్య వేదికపై ఈ నెల 23న బోడె రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ప్రజా సింహగర్జన సభను జయప్రదం చేయాలని శనివారం సాయంత్రం గోడపత్రికను ఆవిష్కరించారు. జన సమీకరణలో భాగంగా వచ్చిన ప్రతినిధి బృందంతో కలిసి, జిల్లా బీసీ సెల్ నాయకుడు ఆరాధ్యుల శివ యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కొత్త తరానికి వారధి, భావితరానికి రథసారథి రామచంద్రయాదవ్ నాయకత్వాన్ని రాష్ట్ర వ్యాప్తంగా బలపరచాలని కోరారు. బాలాజీరావుపేటలోని కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బొంతా శ్రీనివాసరావు, బ్రహ్మ యదవ్, దానబోయిన చంద్రయాదవ్, కుర్రా సాయి, మొవ్వా గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ నవచైతన్య బీసీ సేవా సంఘ కార్యాలయం ప్రారంభం



తెనాలిఅర్బన్: మార్కెట్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏపీ నవ చైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘ కార్యాలయాన్ని సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన జ్యోతిరావు పూలే, సావిత్రీభాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపకులు మేడిబోయిన గంగాయాదవ్, కందుల సాంబశివరావు గౌడ్, తట్టుకుళ్ళ ఆశోక్‌యాదవ్, నల్లగొర్ల నాగేశ్వరరావు, దానబోయిన నరసయ్య యాదవ్, కొడాలి సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సబ్సిడీపై జొన్న విత్తనాల పంపిణీకి సిద్ధం



పెదకాకాని: రైతులకు సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం జొన్న విత్తనాలను అందుబాటులో ఉంచిందని శనివారం పెదకాకాని పశువైద్యాధికారి డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ జొన్న విత్తనాలు సంవత్సరానికి మూడుసార్లు పశువులకు మేతగా ఉపయోగపడతాయన్నారు. కోత కోసిన వెంటనే పశుగ్రాసం తిరిగి పెరుగుతుందన్నారు. ఈ విత్తనాలు పెదకాకాని మండలంలోని వెనిగండ్ల రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిమితి దాటితే చర్యలు

భట్టిప్రోలు: ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ ఆటో డ్రైవర్లకు సూచించారు. శనివారం వెల్లటూరులో బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు అన్ని పత్రాలను వాహనాల్లో ఉంచుకోవాలని చెప్పారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాలు అరికట్టవచునని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

అర్హులకు వరం.. జగనన్న సురక్ష

ఎమ్మెల్యే శివకుమార్

వల్లభాపురం(కొల్లిపర): అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శనివారం మండలంలోని వల్లభాపురం సచివాలయం 1, 2లో జగనన్న సురక్ష కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని, 1159 మందికి పలు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ కారణాలు వల్ల అర్హత ఉండి, ప్రభుత్వ పథకాలు అందని వారికి ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. శిబిరంలో దాదాపు అన్ని అర్జీలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. ఈ నాలుగేళ్లలో ఇళ్ల ముంగిటకు సేవలు దరిచేర్చిన ముఖ్యమంత్రి, సేవా నిరతితో పనిచేస్తున్న వలంటీర్లను నిత్యం ఆడిపోసుకుంటున్న ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుండడంతో ప్రతిపక్షాలు, వాటికి అనుబంధంగా ఉన్న మీడియా సంస్థలు విషం చిమ్ముతున్నాయని ఎమ్మెల్యే ఆరోపించారు. ప్రతి ఇంటికి సంక్షేమాన్ని చేరువ చేసిన ముఖ్యమంత్రికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సంజీవరెడ్డి, సర్పంచ్ వల్లబాపురం నిర్మల, తెనాలి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ అవుతు సీత, నగేష్ రెడ్డి, ఉప సర్పంచ్ అవుతు పోతిరెడ్డి, ఎంపీటీసీలు దేశబోయిన సర్వేశ్వరరావు, కె.రజిని, ఇన్‌చార్జి ఎంపీడీవో వి.చంద్రమోహన్, తహసీల్దారు జి.నాంచారయ్య, ఈవోపీఆర్డీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల పునాదులు కదులుతున్నాయి..

తెనాలి: వలంటీర్లపై దుష్ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దనీ, సంక్షేమ ఫలాల లబ్ధిని దళారులు, అవినీతి లేకుండా నేరుగా అందుకుంటూ, వాస్తవాలు తెలిసిన ప్రజలే ప్రతిపక్షాలకు బుద్ధిచెప్పాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణంలోని 15, 16 వార్డులకు గాను శనివారం మధ్యాహ్నం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ కాలేజిలో జరిగిన జగనన్న సురక్ష సభకు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు అధ్యక్షత వహించారు. రెండు వార్డులకు కలిపి 300 దరఖాస్తులు రాగా అందులో 167 మందికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ మధ్య కొందరు పెద్దనాయకులు, వలంటీర్లు ఇళ్లకు వచ్చి వివరాలు తీసుకుంటే, అవి బయటకు పోతాయని ప్రచారం చేస్తున్నారని, ఈ మాటల్ని ఎవరూ నమ్మవద్దని ఎమ్మెల్యే శివకుమార్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆధార్ కార్డులోనే వివరాలన్నీ ఉన్నాయని గుర్తుచేశారు. ప్రజల వద్దకు పాలనలో భాగంగానే వలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందని స్పష్టంచేశారు. వలంటీర్ల సేవలతో ప్రతిపక్షాల రాజకీయ పునాదులు కదిలిపోతున్నాయనీ, ప్రజలు ఇక తమకు ఓట్లు వేయరనే దుగ్ధతోనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కరోనా కాలంలో ప్రతిపక్షాల నాయకులు హైదరాబాద్‌లో తలదాచుకుంటే, వలంటీర్లను ముందు నిలిపి, ప్రజలకు సేవలను అందించింది అధికారులు, ప్రజాప్రతినిదులమైన తామే కదా? అని ప్రశ్నించారు. ఎక్కడో ఒక వలంటీరు తప్పు చేస్తే, వలంటీరు వ్యవస్థ మొత్తానికి ఆపాదించటం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్, 15వ వార్డు కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావు, 16వ వార్డు పార్టీ ఇన్‌చార్జి కాళిదాసు సత్యం మాట్లాడారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, పేరం సంజీవరెడ్డి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, అసిస్టెంట్ కమిషనర్ అనూష పాల్గొన్నారు.

గత ప్రభుత్వాలు ఎందుకు చేయలేకపోయాయి.

తెనాలి: సంక్షేమం, అభివృద్ధితోపాటు వివిధ సేవలను సత్వరం అందించటమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పాలనను ప్రజల ఇంటి ముంగిటకు తీసుకొచ్చినట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. రూరల్ మండలంలోని కఠెవరం, ఎరుకలపూడి గ్రామాల పరిధిలో జగనన్న సురక్ష శిబిరాన్ని శనివారం కఠెవరం గ్రామ సచివాలయం ఆవరణలో నిర్వహించారు. రెండు గ్రామాలకు కలిపి 1,684 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 రకాల సర్టిఫికెట్లను సత్వరం అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష చేపట్టినట్టు చెప్పారు. ఆయా సర్టిఫికెట్లతో సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకుని, లబ్ధిని పొందవచ్చని చెప్పారు. ఎక్కడా ఎలాంటి అవినీతి లేకుండా ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతిరూపాయి నేరుగా ప్రజలకు చేరుతోందని చెబుతూ ఆ ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలు ఈ వ్యవస్థను స్వాగతిస్తున్నారని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థతో పరిపాలన ప్రజల ముంగిట చేరిందన్నారు. గతంలో ఈ విధంగా ఎవరైనా చేశారా? గత ప్రభుత్వాలు ఎందుకు చేయలేకపోయాయని ఎమ్మెల్యే శివకుమార్ ప్రశ్నించారు. పేదలు, మధ్యతరగతి ప్రజల జీవనప్రమాణాలను పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. తెనాలి ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, తహసీల్దారు హెనాప్రియ, ఎరుకలపూడి సర్పంచ్ చందు శాంతికుమార్, ఎంపీటీసీలు మైలా భానుప్రసాద్, మధిర భగత్‌సింగ్, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఏపీఎం జయశ్రీ, ఏఓ ప్రేమ్‌సాగర్, ఆదాం షఫీ, మాజీ సర్పంచ్ ఆళ్ల మస్తానమ్మ, మాజీ ఎంపీటీసీలు సంకురు బుజ్జిబాబు, కిరణ్, వార్డు సభ్యులు బొనిగల సురేష్, ముక్కాల మహేష్, జీబీసీ చిన్నా, ఎరుకలపూడి సొసైటీ చైర్మన్ మైలా మురళీమోహన్, పార్టీ నేతలు పాల్గొన్నారు.



కఠెవరం సభలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

విద్యార్థులకు నాయకత్వ బాధ్యతలు

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు నాయకత్వ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ముఖ్య నాయకుడు భవిత బాల మాల్యాద్రి, ముఖ్య నాయకురాలుగా కె.జ్యోతిరెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ బ్యాడ్జీలు అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వన్‌టౌన్ సీఐ కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా విధులు నిర్వహించి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ టి.వి.సుబ్రమణ్యం సభ్యులను ఎంపిక చేసి వారికి బ్యాడ్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏవో, కో–ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో సీఐ చంద్రశేఖర్, ప్రిన్సిపల్ సుబ్రమణ్యం

బీ ఫార్మసీ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత

తెనాలి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహించిన బీఫార్మసీ–23 పరీక్షల్లో స్థానిక ఏఎస్ఎన్ ఫార్మసీ కాలేజ్ 8వ సెమిస్టర్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణతను సాధించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో వివరాలను తెలిపారు. విద్యార్థులు డి.సాయిలక్ష్మి గాయత్రి 9.5 జీపీఏ, డి.తిరుపతమ్మ 9 జీపీఏతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, అధ్యాపకులు అభినందించారు.



డి.సాయిలక్ష్మీ గాయత్రి



డి.తిరుపతమ్మ

ఆశ కార్యకర్తలు ప్రతి రోజూ హాజరు వేయాల్సిందే

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు

ప్రత్తిపాడు: ఆశ కార్యకర్తలు ప్రతి రోజూ అటెండెన్స్ రిజిస్టరులో హాజరు వేయాల్సిందేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఏ. శ్రావణ్‌బాబు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ప్రత్తిపాడు–3 గ్రామ సచివాలయాన్ని శనివారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, వెల్‌నెస్ సెంటరులోని మందులతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్లలో ఆశ కార్యకర్తల సంతకాలు లేకపోవడంతో ఇదేమని ప్రశ్నించారు. కచ్చితంగా ప్రతి రోజూ ఆశ కార్యకర్తలు తమ హెల్త్ వెల్‌నెస్ సెంటరులో హాజరు వేయాలన్నారు. అదేవిధంగా సచివాలయ ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు కూడా వెల్‌నెస్ సెంటరులో హాజరు వేసిన తరువాతనే ఫీల్డ్‌కి వెళ్లాలని ఆదేశించారు. ఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు సమన్వయంతో కలిసి పని చేసుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. గ్రామాల్లో ఇంటికే వెళ్లి వైద్యమందించే సేవలు ఏపీలో మాత్రమే ఉన్నాయని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇదొక సువర్ణఅవకాశమని చెప్పారు. సచివాలయ ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పిలు ప్రజల వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం అందిస్తున వైద్యసేవలను వివరిస్తూ, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. వెంట హెచ్ఎస్ నిర్మల తదితరులున్నారు.



మాత్రలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ. శ్రావణ్‌బాబు

శివాలయం అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత

ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు

పెదకాకాని: శివాలయం అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకమండలి తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్యనిర్వహణాధికారి యన్ శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం అర్చకస్వాములు, సిబ్బంది పరిచయ కార్యక్రమం జరిగింది. సిబ్బంది వారి విధులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ధర్మకర్త మండలి సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, తోట రవీంద్ర, కారంకి నాగేశ్వరమ్మ, గుమ్మల వెంకటరావు, చీడిపూడి అరుణ, పాలడుగు వెంకటేశ్వరరావు, మందాళ జ్యోతి, కాట్రోతు పార్వతి, ఎక్స్ అఫీషియో సభ్యుడు పాత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఏసీ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం సభ్యులు

బ్యాంకు రుణాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్‌కి కూడా బ్యాంకు లోనులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ సభ్యులు మేయర్‌ను సంపత్ నగర్ లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి బ్యాంకు నుంచి లోనులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన మేయర్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తుందని, ఉద్యోగులకు మేలు చేకూరే విధంగా బ్యాంకుల ద్వారా లోను ఇచ్చేలా బ్యాంకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఈదులమూడి మధు, అసోసియేషన్ నాయకులు ఏసుబాబు, నరేష్, నాగేశ్వర రావు, సురేష్, ఇతర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.16 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం

ఎమ్మెల్యే శివకుమార్

గుదిబండి వారిపాలెం(కొల్లిపర): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెనాలి నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.13కోట్ల మంజూరు చేయటం జరిగిందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. శనివారం కొల్లిపర పంచాయతీ గ్రామ సచివాలయం 1 పరిధిలోని గుదిబండి వారిపాలెం గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని కుటుంబ పెద్దలకు వివరించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో 15వ ఫైనాన్స్ నిధులతో పలు గ్రామాలల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తుంటే పచ్చ మీడియా, ప్రతిపక్ష నాయకులు మాత్రం ప్రభుత్వ పాలనపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ఎస్టీ కాలనీలోని ఉన్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి(శివకోటి), మండలాధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, చిలువూరి ఝాన్సీ, అవుతు సాంబిరెడ్డి గ్రామ నాయకులు అవుతు శ్రీనుశేఖరరెడ్డి, కళ్ళం వీరారెడ్డి, గుదిబండి క్రిష్ణకిషోర్‌రెడ్డి, వంగా బూషిరెడ్డి, కూరపాటి రవిశేకరరెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, జొన్నలశివారెడ్డి, , భీమవరపు సీతారామిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు జి.నాంచారయ్య, ఎంపీడీవో చంద్రమోహన్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

జీజీహెచ్‌కు వస్తూ.. ఆధార్ కార్డు తెచ్చుకోండి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అవుట్ పేషెంట్ విభాగంలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. తద్వారా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాలు రోగులకు త్వరితగతిన అందేందుకు దోహదపడుతోందన్నారు. శనివారం ఆసుపత్రిలో ఓపీ కౌంటర్‌లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో రోగులు తమ పేర్లు నమోదు చేసుకోవడంలో జాప్యాన్ని నివారించేందుకు ఆధార్ కార్డులు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

దాతలు ముందుకు రావాలి

ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ సమక్షంలో రూ.40 వేలు విలువ చేసే ఔషధాలను శనివారం సూపరింటెండెంట్ అందజేశారు. ఆసుపత్రిపై ఉన్న మమకారంతో రోగులకు ఉచితంగా అందజేేందుకు మందులు అందజేసిన డీఆర్‌డీఏ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో 30 ఏళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న ఉస్మాన్ ట్యూబ్‌లైట్లు ఆసుపత్రికి బహూకరించడంతో డాక్టర్ కిరణ్‌కుమార్ సదరు ఉద్యోగిని అభినందించారు. గుంటూరు జీజీహెచ్‌లో వ్యాపారాలు చేస్తున్న నిర్వాహకులు అపరిశుభ్ర వాతావరణం కల్పిస్తున్నారని, తద్వారా చెడు సంఘటనలు జరిగే ప్రమాదం ఉందని సూపరింటెండెంట్ అన్నారు.. షాపుల నిర్వాహకులు తమ నిర్దేశించిన ఉత్పత్తులను మాత్రమే విక్రయించాలని, వ్యర్థాలను సక్రమమైన రీతిలో నిర్వీర్యం చేయకపోతే ఎలుకలు, పందికుక్కలు తిరిగే ప్రమాదం ఉందన్నారు. వ్యాపారస్తులు ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచి ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలన్నారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్ పాల్గొన్నారు.



ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

నైపుణ్యాభివృద్ధికి అవగాహన ఒప్పందం

బాపట్ల అర్బన్: విద్యార్థులకు నైపుణ్య శిక్షణను అందించటానికి బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల, కేఎల్ యూనివర్శిటీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. శనివారం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో సమావేశం జరిగింది. కేఎల్ యూనివర్శిటీ అంకుర స్థాపన నిర్వహణ అధ్యక్షుడు డాక్టర్ అలోక్ గోవిల్ మాట్లాడారు. విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను అర్థం చేసుకొని, వాటిని సృజనాత్మకతతో పరిష్కరించాలన్నారు. తద్వారా వారి స్థితిగతులను మెరుగుపరచడానికి తోడ్పాటు అందించాలన్నారు. డాక్టర్ రమణకాంత్ ప్రభుత్వం విద్యార్థుల్లో అంకురాల పట్ల అవగాహన కల్పించడానికి తీసుకున్న కార్యక్రమాలను వివరించారు. డాక్టర్ సన్నీ, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ నజీర్ మాట్లాడుతూ.. కేఎల్ యూనివర్శిటీతో ఒప్పందం జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. అనంతరం అవగాహన ఒప్పంద పత్రాలపై ఇరు బృందాలు సంతకం చేశాయి. కార్యక్రమంలో కన్వీనర్ ఐక్యుఏసీ డాక్టర్ సుందర్ కుమార్, వర్శిటీ ప్రతినిధులు సాయికిరణ్, మహేష్, సీఐఐ కన్వీనర్ డాక్టర్ లక్ష్మీశ్రీనివాస్ పాల్గొన్నారు.



అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ప్రతినిధులు

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి



బాపట్ల: బాపట్ల పట్టణంలోని మచ్చావారిపాలెం వద్ద ట్రాక్టర్ తిరగబడి బెజ్జం ఓషయ్య(33) మృతి చెందారు. పట్టణంలోని దర్శిపెద్ద మస్తాన్‌నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు ట్రాక్టర్ డ్రైవర్‌గా ఉప్పరపాలేనికి చెందిన బెజ్జం ఓషయ్య పని చేస్తున్నాడు. మచ్చావారిపాలెంలో శనివారం ట్రాక్టర్ తిరగబడి అక్కడక్కిడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

యాచకులకు అన్నదానం

తెనాలిఅర్బన్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని సంఘ పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద శనివారం వృద్ధులు, పేదలు, వికలాంగులు, యాచకులకు అన్నదానం చేశారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులోని గోశాలలో గోవులకు మేత, దాణాను అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, షేక్ మీరావలి, అన్నం గణపతి, అక్కల రమేష్, తుల్లిమిల్లి చంటి, కందుల వేణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో 'కేంద్రీయ'విద్యార్థుల ప్రతిభ



తెనాలిఅర్బన్: కేంద్రియ విద్యాలయ సంఘటన్ ప్రతినిధులు కొద్ది రోజుల క్రితం నిర్వహించిన అథ్లెటిక్స్ స్పోర్ట్స్ మీట్‌లో తెనాలిలోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు జి.సాయినిఖిల్, జి.శాంతి సుజన, సయ్యద్ రఫియాలు బంగారు పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.శ్రీకాంత్ తెలిపారు. మరికొందరు వివిధ విభాగాల్లో పలు పతకాలు సాధించినట్లు చెప్పారు. వీరికి పాఠశాల ఆవరణలో శనివారం పతకాలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి.రవికుమార్, కోచ్ అజయ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు వంట సామగ్రి బహూకరణ

తెనాలిరూరల్: పట్టణ మోరిస్‌పేటలోని ఆర్‌ఆర్ నగర్‌లో గల గిరిజన బాలికల గురుకుల పాఠశాలకు కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ అధికారులు వంట సామగ్రిని బహూకరించారు. గుంటూరు అసిస్టెంట్ కమిషనర్ రవి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అసిస్టెంట్ కమిషనర్ రాజేశ్వరరావు శనివారం పాఠశాలకు విచ్చేశారు. పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వంట సామగ్రిని అందజేశారు. వీరితో తెనాలి 2వ ఎంఈవో జయంత్ బాబు ఉన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ బండి విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

తెనాలిరూరల్: బెల్టు షాపు నిర్వాహకుడిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం సోమసుందరపాలెం గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన లుక్కా వెంకటేశ్వరరావు అలియాస్ జపాన్ మద్యం విక్రయాస్తున్నట్టు గుర్తించారు. అతని నుంచి 35 మద్యం సీసాలు స్వాధీనపర్చుకుని, అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇసుక డంప్ స్వాధీనం

తెనాలిరూరల్: అక్రమంగా నిల్వ చేసిన 125 టన్నుల ఇసుక డంప్‌ను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) అధికారులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. తెనాలి మండలం ఖాజీపేటలో ఇసుక డంప్ ఉందన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తన సిబ్బందితో శనివారం తనిఖీకి వెళ్లారు. 125 టన్నుల డంప్‌ను గుర్తించి స్వాధీనం చేసుకోవడంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేశాడని గ్రామానికి చెందిన చక్కా రామాంజనేయులును అదుపులోకి తీసుకుని, రూరల్ పోలీసులకు అప్పగించారు.

కుక్కను తప్పించబోయి.. బైక్ మీద నుంచి పడి యువకుడి మృతి



మృతుడు శివసుబ్రహ్మణ్యం

నగరం: ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనంపై నుంచి పడి యువకుడు మృతిచెందిన ఘటన శనివారం మంత్రిపాలెం గ్రామం వద్ద జరిగింది. ఎస్ఐ రామకృష్ణ సమాచారం మేరకు.. నిజాంపట్నం మండలం అడవులదీవి శివారు గుణంతిప్ప గ్రామానికి చెందిన మేకా శివసుబ్రమణ్యం(20) ఇంటి వద్ద నుంచి రేపల్లె కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. మంత్రిపాలెం వద్ద ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి జారిపడి కిందపడ్డాడు. దీంతో శివసుబ్రమణ్యంకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్రమణ్యం మృతి చెందాడు. మృతుడు రేపల్లె ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ప్రతి రోజు కళాశాలకు ద్విచక్రవాహనంపై వెళ్తుంటాడు. మూడు నెలల కిత్రం కొత్త బైక్ కొన్నాడు. కుమారుడు మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుని తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com